క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి


పెట్రోల్‌పంపు సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో తొలగించిన విగ్రహాన్ని కొంత కాలం క్రితం సమీపంలోని పెట్రోల్‌పంపు ఆవరణలో ఉంచారు. ఇప్పటికీ విగ్రహాన్ని అక్కడే ఉంచడంపై వైఎస్సార్ అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నేతలు స్పందించి విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలని వైఎస్సార్ అభిమానులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నమని శివకుమార్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. తొమ్మిదో తరగతి విద్యార్థుల జీవశాస్త్ర సాధనపై జీవిత నైపుణ్యాలు, అధ్యయన అలవాట్ల ప్రభావంపై అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ అందించినట్లు తెలిపింది. యూనివర్సిటీ ఈ థీసిస్‌ను ఆమోదించి శివకుమార్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించింది. శివకుమార్ ఎమ్మెస్సీ బోటని, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఈడీ, పీజీ డిప్లొమా ఇన్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్, నెట్ ఇన్ ఎడ్యుకేషన్‌తో పాటు ప్రస్తుతం పీహెచ్‌డీ పూర్తిచేశారు. పలువురు అభినందించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దామెర : పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.విజయభాస్కర్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని సందర్శించి పత్తి, వరి, సోయ, పసుపు, కూరగాయల పంటలను పరిశీలించారు. పత్తి పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలో నీరు తీసేసి 13:0:45 లేదా 19:19:19 నీటిలో కరిగే ఎరువులను ఎకరాకు 1 కిలో చొప్పున 200 లీ. నీటిలో కలిపి ఆకు తడిచేలా పిచికారీ చేయాలని అన్నారు. వడలు, తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు.

కొకొండ గ్రామస్తుల ధర్నా

నడికూడ : పరకాల–అంబాల ప్రధాన రోడ్డు నుంచి కొకొండకు వచ్చే 3కిలో మీటర్ల రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామస్తులు ధర్నాకు దిగారు. రెండేళ్ల నుంచి పనులు పూర్తిచేయకుండా కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నాడని ఆరోపించారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి పనులు పూర్తిచేసి రవాణా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇద్దరిపై వేర్వేరు కేసులు

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పనుల జాతర–2025లో భాగంగా గతనెల 24న మల్లికుదుర్లలోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి శిలాఫలకాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. అయితే సీసీ రోడ్డు కింద తన భూమి పోతుందనే కోపంతో గ్రామానికి చెందిన బట్టు సాగర్ ట్రాక్టర్‌తో శిలాఫలకాన్ని కూలగొట్టాడని, కానీ తన భూమి రోడ్డు నిర్మాణంలో పోవడం లేదని, గ్రామంలో రాజకీయ కారణాల వలన శిలాఫలకాన్ని ధ్వంసం చేశాడని పీఆర్ ఏఈ రూపావతి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పైపులైను ధ్వంసం చేసిన వ్యక్తిపై..

గుండ్లసాగర్ గ్రామానికి చెందిన ఓ రైతుకు సంబంధించిన వ్యవసాయ మోటార్ పైపులైనును ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన నీలం సమ్మయ్యకు 2 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఆ పొలానికి సాగునీరు పారించేందుకు పక్కనున్న పిట్టల జయపాల్ పొలం నుంచి పైపులైను వేశారు. జయపాల్‌తో సమ్మయ్యకు ఉన్న పాత గొడవలను కారణంగా జయపాల్ తన పైపులైను ధ్వంసం చేశాడని సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంబర్ ప్యాకెట్ల పట్టివేత

ఎల్కతుర్తి : అంబర్ ప్యాకెట్లు విక్రయించేందుకు తరలిస్తున్న వ్యక్తిని ముల్కనూరు పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద బ్యాగ్‌తో అనుమానస్పదంగా ఓ వ్యక్తి కనిపించినట్లు తెలిపారు. దీంతో అతడిని తనిఖీ చేయగా బ్యాగులో 15 అంబర్ ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. విచారణ చేపట్టగా కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్‌కు చెందిన రాయవేని మల్లయ్యగా తెలిసిందన్నారు. అతని వద్ద నుంచి అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అంబర్ ప్యాకెట్ల విలువ సుమారు రూ.7,500 ఉంటుందని తెలిపారు.

నిలిచిన కార్గో సేవలు

- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- వినియోగదారులకు తప్పని ఇబ్బందులు


పరకాల బస్టాండ్‌లో మూసిఉన్న కార్గో సర్వీస్ సెంటర్

పరకాల : సరుకుల రవాణాకు సౌకర్యవంతమైన కార్గో సేవలు పరకాల బస్టాండ్‌లో ఆరు నెలలుగా నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు పార్సిల్ సర్వీస్‌లకు పోటీగా తక్కువ ధరకు ఆర్టీసీ బస్సుల ద్వారా పార్సిల్ రవాణా సేవలను అప్పటి ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సేవల్లో భాగంగా పరకాల బస్టాండ్ నుంచి కూడా ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కానీ కొంత కాలం తర్వాత ప్రైవేటు వ్యక్తులకు టెండర్ ప్రక్రియ ద్వారా కేటాయించారు. దీంతో టెండర్ దారుడు ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేదన్న కారణంతో ఆర్టీసీ అధికారులు కార్గో సేవలు నిలిపివేశారు. పాత వారి నుంచి కొత్త వారికి కార్గో సేవల టెండర్‌ను కేటాయించకుండా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పార్సిల్స్, పరకాల నుంచి పార్సిల్ వినియోగదారులు ప్రైవేట్ సెంటర్లకు వెళ్తున్నారని, దీంతో ఆర్థికంగా కొంత నష్టపోతున్నామని పలువురు అంటున్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్గోపై నమ్మకం ఉండేది

ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్గో సేవలతో ఆర్థికంగానే కాకుండా చాలా తక్కువ సమయానికి పార్సిల్ చేరుకునేది. ఆర్టీసీ కార్గో సేవలపై నమ్మకం ఉండేది. కానీ సేవలు నిలిపివేయడంతో ప్రైవేటు పార్సిల్ సర్వీస్‌ల దోపిడి పెరిగిపోయింది.

– పైండ్ల శాంతికుమార్, చిన్నకోడెపాక

నూతన టెండర్‌కు అవకాశం కల్పిస్తున్నాం

పరకాల బస్టాండ్‌లో ఏర్పాటు చేసే కార్గో సేవలకు టెండర్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తున్నాం .ఆర్టీసీ సంస్థ నియమ నిబంధనల ప్రకారం కేటాయిస్తాం.

– రాంప్రసాద్, ఆర్టీసీ డీఎం-పరకాల

రైతులకు సరిపడా యూరియా అందించాలి


ఎల్కతుర్తి : రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కమలాపూర్‌లో..

ఎల్కతుర్తి : రైతులకు సరిపడా యూరియా అందించాలని బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని అన్నారు. యూరియా కోసం రైతులు క్యూలు కడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని విమర్శించారు.

'కాళేశ్వరం'పై పొంతనలేని మాటలు

కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై పొంతన లేని మాటలు మాట్లడడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని, కేసీఆర్ ప్రభుత్వంలో ప్రాజెక్టు నిర్మిస్తే పిల్లర్లు కుంగాయని ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు. సంఘటన స్థలానికి పోలీస్‌లు చేరుకుని నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు మహేందర్, సురేందర్, రవీందర్‌గౌడ్, రవీందర్, సంపత్, మహేందర్, స్వామి, స్వప్న, నగేష్, సమ్మయ్య, మధన్‌మోహన్ రావు, కొమురయ్య, దేవేందర్‌రావు, బాబురావు, చంద్రమౌళి, సతీష్, కార్తీక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కమలాపూర్ : కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు, రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించకపోవడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో మంగళవారం హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క రైతు యూరియా కోసం ఇబ్బంది పడలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

ఐనవోలు : కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మోహన్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని పున్నేలు క్రాస్ వరంగల్–ఖమ్మం రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్‌రావు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీమా డబ్బులు అందజేత


బీమా డబ్బులను అందజేస్తున్న అమరేందర్‌రెడ్డి

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని శ్రీసత్యసాయి, శ్రీషిరిడిసాయి పురుషుల పొదుపు సంఘాల్లో సభ్యులైన ఎం.శ్రీనివాస్, కే.మల్లయ్య, బండి అనిల్, ఎస్.కుమారస్వామి ఇటీవల మృతిచెందారు. మృతులు సంఘంలో సాధారణ బీమా కలిగి ఉండటంతో వారి కుటుంబ సభ్యులైన నామినీలకు మంగళవారం రూ.80 వేలు చొప్పున మొత్తం రూ 3.2లక్షల బీమా డబ్బును సమితి, సంఘం అధ్యక్షులు బిల్లా అమరేందర్‌రెడ్డి, మేకిరి రమేశ్ మంగళవారం అందించారు. ఎండీ.అక్బర్, సంఘం పాలకవర్గ సభ్యులు, గణకులు కల్వల సతీశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్

నడికూడ : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రాయపర్తి పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశ కార్యకర్తలకు నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. అనంతరం ఫీవర్ సర్వే రికార్డ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల పక్షపాతి వైఎస్సార్


ధర్మసాగర్ : నినాదాలు చేస్తున్న నాయకులు


ఎల్కతుర్తిలో..


పరకాలలో..


శాయంపేటలో..


ఆత్మకూరులో..

ధర్మసాగర్ : నిరుపేదల పక్షపాతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని పలువురు కొనియాడారు. మండలంలోని ధర్మపురం గ్రామంలో యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు టేకుమట్ల విష్ణు ఆధ్వర్యంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పండ్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచులు యాకుబ్, రవయ్య,నాయకులు అనిల్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దివాకర్, దయాకర్, శ్రీను, రాజు, అనిల్, రాజు, సుమన్, రాజేందర్, సంజీవ, వెంకటస్వామి, సదానందం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వైయస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి మండల కేంద్రం, భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు సంతాజీ, మహేందర్, యాదగిరి, రాజయ్య, రమేశ్, రంజిత్‌రెడ్డి, బాబురావు, సుమన్, శ్రీకాంత్, వెంకట్, ప్రదీప్, నితిన్, శ్రీనివాస్, రవీందర్, సుధీర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, సొసైటీ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ సామేల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, నాయకులు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరన్న, రంగారెడ్డి, నర్సింహ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ అభిమాని సుధాకర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరకాల : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పట్టణంలో నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సంపత్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎస్ఐ కాలనీలో కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ శ్రీను, శ్రీనివాస్, రవి, జితేందర్, సారయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్‌బ్యాగుల పంపిణీ


బ్యాగులు అందజేస్తున్న అయిలయ్య

ఎల్కతుర్తి : మండల పరిధిలోని బావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బావుపేట గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి దాట్ల అయిలయ్య సొంతంగా పదివేల రూపాయల విలువచేసే స్కూల్‌బ్యాగులను మంగళవారం విద్యార్థులకు అందించారు. అయిలయ్యకు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. మాజీ సర్పంచ్ సురేందర్, స్థానికులు కుమారస్వామి, వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

భీమదేవరపల్లి మండలం కొత్తకొండ, మల్లారం గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సైకిళ్ల పంపిణీ చేశారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు.

బీజేపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన నాయకులతో అరూరి రమేశ్

ఐనవోలు : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మంగళవారం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై యువత పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. దొనికెల వెంకటేశ్, రాజేష్, మోహన్‌రావు, రాజయ్య, సురేష్, నాగరాజు, చందు, ధనుంజయ్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ప్రణయ్, జఫర్‌గడ్ మండల అధ్యక్షుడు నగేష్‌గౌడ్, నాయకులు రాజు, వనం రెడ్డి, రమేశ్, విక్రమ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను గుర్తిస్తున్న ప్రజలు

- మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి విమర్శ


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ధర్మారెడ్డి

దామెర : అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజలు, ఆ పార్టీ కార్యకర్తలు గుర్తిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. మండలంలోని వెంకటపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరగా మంగళవారం ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించడంలేదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌లో చేరినవారిలో మాజీ వార్డు సభ్యులు పండుగ శ్రీనివాస్, పండుగ సమత, మోర్తాల బాబురావు, గోల్కొండ స్వామి, నరేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, మాజీ సర్పంచ్ సంపత్, నాయకులు రాజు, రాజ్‌కుమార్, రమేష్, బాబురావు, చిన్నరాజు, శ్రీధర్, సారంగం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల పోరాటం చిరస్మరణీయం


అమరధామం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పరకాల : నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో అప్పటి పోలీసుల కాల్పుల్లో అమరులైన తెలంగాణ పోరాట యోధులకు మంగళవారం స్వాతంత్ర్య సమర యోధుల వారసుల సంఘం ఘన నివాళులర్పించింది. అమరవీరుల మైదానంలోని స్మారక స్థూపం వద్ద స్వాతంత్ర్య సమర యోధుల వారసుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పింగిళి విజయపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రేపాల నర్సింహరాములు ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించి మౌనం పాటించారు. అదే విధంగా బిట్స్ విద్యార్థులు, బీజేపీ నాయకులు అమరవీరుల మైదానం, అమరధామం వద్ద అమరవీరులకు నివాళులర్పించి నినాదాలు చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ.. నిజాం పాలన నుంచి విముక్తి కోసం జరిగిన నాటి పోరాటాన్ని, అమరవీరుల సాహస గాథలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు గురుప్రసాద్, సత్యనారాయణరావు, మేఘనాథ్, పురుషోత్తం, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు పూర్ణాచారి, భద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి


ధర్మసాగర్ : ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి


ఎల్కతుర్తి : గోపాల్‌పూర్ చెరువును పరిశీలిస్తున్న సీఐ పులి రమేశ్


- ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

ధర్మసాగర్ : మండలంలో శనివారం జరుగనున్న వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రిజర్వాయర్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను స్థానిక సీఐ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్‌తో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లైటింగ్, క్రేయిన్ ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. వారి వెంట ఎస్సై నర్సింగరావు, కారోబార్ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంతో పాటు గోపాల్‌పూర్‌లోని చెరువులను సీఐ పులి రమేశ్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 5న జరుగనున్న గణపతి నిమజ్జనంలో ఎలాంటి అపశృతి చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గణపతి మండపాల్లో దీపారాధన


కమలాపూర్ : దీపారాధన చేస్తున్న భక్తులు


దామెర : గణపతి ఆకృతిలో విద్యార్థులు

కమలాపూర్ : గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీవిశ్వసాయి యూత్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దీపారాధనను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు వినాయక మండపంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భక్తులకు మంగళవారం అన్నప్రసాదాల వితరణ చేశారు. లత, రమ, కల్యాణి, వరలక్ష్మి, సుమలత, విజయ, సంగీత, లలిత, సరిత, మంజుల, పుష్ప, లావణ్య, సరళ, భక్త భజన మండలి నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణపతి ఉత్సవాలు

దామెర : మండల వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రం సమీపంలోని శ్లోక పాఠశాలలో విద్యార్థులు గణపయ్య ఆకృతిలో విన్యాసాలు చేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మండల కేంద్రంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. దామేశ్వరాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల రాజుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గణపతి మండపాల వద్ద అన్నదానం

ఎల్కతుర్తి : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని ఆయా గ్రామాల్లో గల గణపతి మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.

'స్థానికం'లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న భిక్షపతి

ఎల్కతుర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం నిమ్మల మనోహర్ అధ్యక్షతన జరిగింది. ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుకగా భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు సీపీఐ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు రాములు, లక్ష్మణ్, శ్రీనివాస్, వెంకటరమణ, మొండయ్య, మోహన్‌రెడ్డి, మనోహర్‌రావు, కుమారస్వామి, తిరుమల పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వరంగల్ అర్బన్:
9951602875 | 9553955722 | 9010299096

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (హన్మకొండ)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
ఎస్. నవీన్ (S.R) : 8919855163 (ఎల్కతుర్తి)